# తెలిసిన నిజం

రచన :
శ్రీ కె. విజయ్ బాబు.

'కమలా !'

'ఏమండీ !'

'ఇలారా !'

'ఎందుకండీ !'

'వస్తావా? రావా?'

'అబ్బబ్బ ఉండండీ! పొయ్యిమీద పాలున్నాయి - పొంగుతాయి, ఒక్క నిమిషం ఓపిక పట్టండి, కాఫీ కలిపి తీసుకవస్తాను.'

'ముందు నువ్వా వంటింట్లోంచి వస్తావా? లేదా?'

'ఏదేమిట్రా శేఖరం! ఇల్లెగిరిపోయేలా ఆ గావు కేకలు?' అంటూ శేఖర్ తల్లి జానకమ్మ పూజా మందిరం లోంచి హాల్లోకి వచ్చింది.

'అమ్మా! నీకేం తెలీదు. నువ్వూరుకో'

'ఔను గాని, ఏదేమిట్రా యివాళ యింటికొస్తూనే ఈ ఉగ్రనరసింహావతార మెత్తేవు?'

'అబ్బా! నీక్కాదుటమ్మా చెప్తుంటె! నువ్వేం మాట్లాడకుండా పూజా మందిరంలో వెళ్ళి పూజ చేసుకో'

'కారణం చెప్పకుండా నువ్విలా గావు కేకలు వేస్తుంటే ఎలారా? ఇంతకీ ఎవరిమీదా కోపం?'

'ఇంకెవరు? నీ ముద్దుల కోడలు! కోడలు - కోడలు అని చనువిచ్చి నెత్తికెక్కించుకొని దాన్ని పాడు చేసింది నువ్వే! అది నీ అలుసు చూసే యిలా తయారయింది.'

'రామ! రామ! ఎంత మాటన్నావురా?'

'ఏమి కమలా! వంటింట్లోంచి బయటకు వస్తావా? లేక నేనె రావాలా?'

'అబ్బ! ఉండండి! ఇంటికొస్తూనె కమలా! కమలా! అని ఒకటే కలవరింత' అంటూ మందహాసవదనంతో శేఖర్ భార్య కమల కాఫీ కప్పుతో అక్కడ ప్రత్యక్షమైంది. 'ఇంక తీసుకోండి కాఫీ! పాపం! ఇందాకట్నుంచి పిలిచి పిలిచి అలసిపోయినట్టున్నారు. మీ కోసం స్పెషల్ గా కాఫీ పెట్టి తెచ్చాను.'

'ఆపునీ వంగనాచి కబుర్లు! కాఫీతో నీ కల్మషాన్ని కప్పిపుచ్చుకుందా మనుకుంటున్నావా? ఏదో చదువుకున్న దానివికదా అని చనువిస్తే నువ్వింత హద్దులు మీరుతావనుకోలేదు. ఇన్నాళ్ళూ నువ్వు నామీద చూపించే ప్రేమంతా నటన అని ఈ రోజువరకు తెలుసుకోలేకపోయాను. నువ్వింతటి పయోముఖవిషకుంభానివని ఈ నాటికి తెలుసుకున్నాను. ఇప్పటికి నీ గుట్టు బయటపడింది. నువ్వింతటి నీచానికి పాల్పడుతావనుకోలేదు'

ఆకస్మాత్తుగా బాణాల్లా తగిలిన ఆ మాటలకు కమల నిశ్చేష్టితురాలై పోయింది. 'అయ్యో! ఏమిటండీ ఈ మాటలు? నావి వంగనాచి కబుర్లా? పయోముఖవిషకుంభాన్నా? కాపురాన్ని కొచ్చి యేడాదవుతోంది. ఎప్పుడైనా నన్ను పల్లెత్తుమాటన్నారా? ఒక్కక్షణం నేను కనబడకపోయే సరికి కమలా! అంటూతపించిపోయే మీరేనా ఈ మాటలంటున్నది? నా చెవుల్ని నేనె నమ్మలేకపోతున్నాను. నేనేం తప్పు చేసానండీ! నన్నిలా మాటల్తో చిత్రవధ చేస్తారు' వెక్కి వెక్కి యేడ్వసాగింది కమల.

'చేసిన పాపానికి చింతపడకుండా కప్పి పుచ్చుకుందామనుకుంటున్నావా? యేనాటికైనా గుట్టురట్టవుతుందని తెలుసుకోలేకపోయావు. పైగా కల్ల బొల్లి యేడ్పులు కూడానా?' నిప్పులు కక్కుతున్నాడు శేఖర్.

'నేనే పాపమూ ఎరగనండీ! నేను తెలియక చేసిన తప్పులేమైనా వుంటే క్షమించండి.'

'ఛీ! ఛీ! నీ పాడు ముఖం నాకు చూపించకు నిజంగా ఇన్నాళ్లూ నీ ప్రేమంతా నిజమేనని నమ్మి మోసపోయాను, నువ్వింత నీచానికి వడికట్టి మాకింత తలవంపులు తెస్తావనుకోలేదు. చదువుసంస్కారంవున్న దానివని కోరిచేసుకున్నందుకు నా కింత అన్యాయం చేస్తావని కల్లో కూడా అనుకోలేదు. భర్తకు ద్రోహం చేసే కులటవని ఈనాటికి తెలుసుకున్నాను. "ఎన్నాళ్ళనుంచీ ప్రేమ వ్యవహారాలు సాగుతున్నాయి? నిజం చెప్పు" సింహంలా గర్జించాడు.

'హర! హర! ఎంత మాటన్నావురా! సీతామహాలక్ష్మి లాంటి కమలనె కులట అంటావురా! దాన్నలా అనడా

నికి నీకు నోరెలావచ్చిందిరా? నీకేం పిచ్చి పట్టలేదు కదా?'

'అం! మదపిచ్చే పట్టింది. అమ్మా! నువ్వేంత మాత్రం యిందులో కలగ చేసుకోవద్దు.'

"ఏమే కమలా! ఎన్నాళ్ళనుంచీ ప్రణయ కలాపాలు సాగిస్తున్నావు? ఇప్పటికైనా నిజం చెప్పు?" త్రాచు పాములా కస్సుమన్నాడు.

'నేనే ప్రేమ కలాపాలూ ఎరుగనండీ! మీరే నా ఆరాధ్య దైవమని నమ్ముకున్నాను. నన్నెందుకిలా అన రాని మాటల్తో బాధిస్తారు? నేచేసిన తప్పేమిటో చెప్పండి. దిద్దుకుంటాను' శేఖర్ కాళ్లమీదపడి వేడు కుంది.

'ఛీ, పాపిష్టిదానా! నీ తప్పును నా నోటితో చెప్పించాలనుకుంటున్నావా? నీ వగలానిమాటల్తో నా మనసు మార్చాలనుకుంటున్నావా? ఛీ! నీ మోహం చూస్తేనే పాపం. ముందీ యింట్లోంచి ఫో! పోయి వాడితోనే కులుకు.'

"నేను మీ కేలాంటి ద్రోహమూ చెయ్యలేదండీ! మిమ్మల్నే నా పవిత్రమూర్తిగా కొలుస్తున్నాను. నాకేలాంటి నీచసంబంధమూ లేదండీ! నామాట నమ్మండి. నా తప్పు తెలియజేసి నన్ను మన్నించండి!! నేను మీ పాదాల్ని విడిచి ఒక్క క్షణం కూడా వుండలేను!" కన్నీటితో శేఖర్ పాదాల్ని తడిపింది.

'నోర్మూయ్!' కమల చెంప చెళ్ళుమంది. ఆమె మెడ పట్టుకు ఒక్కతోపు తోశాడు శేఖర్.

'అత్తయ్యా!' అంటూ జానకమ్మగారిమీద వాలి పోయి వెక్కి వెక్కి ఏడవ సాగింది కమల.

"ఒరేయ్ శేఖర్!" బెబ్బులిగా గర్జించింది జానకమ్మ. "దుర్మార్గుడా! నీకు నిజంగా నే మదపిచ్చి పట్టింది. దాన్నలా కొట్టినందుకు నీకు పుట్టగతు లుండవు జాగ్రత్త! నువ్వింత మానవత్వాన్ని మరచిన మూర్ఖుడ వనుకోలేదు. విచక్షణా జ్ఞానం లేకుండా నీ నోటికెంత తోస్తే అంతా కూసెయ్యడమే! నిజానిజాలు తెలుసుకోవద్దూ! కమల చేసిన తప్పేమిటో చెప్పకండా ఆఫీసు నుంచి వస్తూనే నీ నోటికొచ్చినట్టు వాగుతున్నావు. ఇదట్రా నీ చదువు సంస్కారం! అది ఈ గడప దాట డానికి వీల్లేదు తెల్సిందా?" శక్తిరూపం దాల్చింది జానకమ్మగారు.

"అమ్మా!" శేఖర్ కంఠం కంచులా కంగున మ్రోగింది. "దాన్నలా వెనకేసుకురాకు. అది ఈ యింటి కోడలు కాదు. పరాయివాళ్ళతో ప్రణయ కలాపాలు సాగించే పచ్చి కులట. అది ఒక్క క్షణం ఈ యింట్లో వుండటానికి వీల్లేదు." కోపంతో గడగడ వణికిపోయాడు శేఖర్.

ఇంతలో శేఖర్ బావమరది మధు అక్కడ ప్రత్యక్షమయ్యాడు. వస్తూనే శోకమూర్తిలాగున్న చెల్లెల్ని, ఉగ్రమూర్తిలాగున్న శేఖర్‌ని చూసి నిర్ఘాంత పోయాడు. కారణం తెలియక కలవర పడ్డాడు.

మెల్లగా శేఖర్ దగ్గరికెళ్ళి 'ఏమిటి బావా! ఈ పరశురామావతార మెత్తేవు? ఏమిటి సంగతి?' అని అడిగాడు.

మధుని చూడగానే మరింత తాడెక్కిన శేఖర్ ఆ సంగతేమిటో నీ ముద్దుల చెల్లెల్నే అడుగు అన్నాడు.

"ఏం జరిగింది కమలా! ఎందుకలా ఏడుస్తున్నావు? బావగారేమిటి ఈ ఉగ్రరూపం దాల్చేరు? ఏమైనా మన స్పర్ధలొచ్చాయా యేమిటి?"

"అన్నయ్యా!" అంటూ మధుని కౌగిలించుకుని వెక్కి వెక్కి ఏడ్చింది కమల.

"ఏం జరిగింది అత్తయ్యా! మీరైనా చెప్పండి" అన్నాడు కంగారు పడుతూ మధు.

'!ఏమో నాయనా! రోజూ యిద్దరూ చిలకా గోరింకల్లా కబుర్లాడుకుంటూ సరదాగా వుండేవారు. ఏమిటో మరి, ఈ రోజు యింటికొస్తూనే ఈ రౌద్రావతార మెత్తేడు. రోజూ ఆఫీసునుంచి వస్తూనే 'కమలా! కమలా!!' అని కలవరించే వీడు దాన్ని నానా దుర్భాషలూ ఆడటం మొదలెట్టాడు. అసలు కారణ మేమిటో చెప్పడు"

"ఏం జరిగింది బావా! ఒకవేళ నా చెల్లెలు తెలియక ఏదైనా తప్పు చేస్తే నేను దాని తరఫున క్షమాపణ వేడుకుంటున్నాను. అసలువిషయం చెప్పు బావా!" ప్రాధేయ పడ్డాడు మధు.

'తప్పుచేసిన నీ చెల్లెల్నే అడుగు ఆ అసలు కారణం"

'ఏమమ్మా! కమలా! అసలు ఏం జరిగిందో చెప్పమ్మా! ఆయనకి అంత కోపం తెప్పించే తప్పేం చేశావు. దాచ

(తరువాయి 24వ పేజీలో)

(6వ పేజీ తరువాయి)

కుండా వున్నది వున్నట్టు చెప్పు. వున్న చెల్లెలివి నువ్వొక్కర్తివే! నిన్నల్లారు ముద్దుగా చూసుకుంటున్నామే నువ్విలా కంట తడిపెడ్తే నేను చూడలేను. నువ్వు సౌఖ్యంగా వుంటేనే మా కానందం. సంగతేమిటో చెప్పమ్మా!' చెల్లెల్ని బుజ్జగించాడు.

"నే నే పాపమూ ఎరగను అన్నయ్యా! తెలిసినంత వరకు నేనెలాంటి ద్రోహమూ ఆయనకు తలపెట్టలేదు. వారు నన్నపార్థం చేసుకుంటున్నారు" వలవల యేడ్చింది.

"బావా! నా చెల్లి చేసిన దీషమేమిటో నువ్వే చెప్పు. అదినిజంగా నువ్వనుకున్నంత ఘోరపాపమే చేసినట్లయితే నీ కళ్ళముందే దాన్ని పీక పిసిగి చంపేస్తాను." తాండవరూపం దాల్చాడు మధు.

"ఏం చేసిందా! నానోటితోనే చెప్పించాలనుకుంటున్నావా? సరే. అయితే విను. రోజూ నీళ్ళకని నీ ముద్దు చెల్లెలు కొళాయికెళ్ళి అక్కడే పరంధామయ్యగారింట్లో అద్దెకుండే కాలేజీ స్టూడెంటుతో ప్రేమ వ్యవహారాలు సాగిస్తోంది. వీళ్ల సంభాషణలకు, పకపకలకు అంతులేకుండా పోతోందట. ఆ ప్రక్కవాటాలోనే అద్దెకుండే మా హెడ్ క్లార్కు రామనాథం ఈ రోజున చెప్పేవరకూ నాకీ ప్రేమ వ్యవహారాలేవీ తెలియవు. ఇంతకన్న నమ్మక ద్రోహం యింకేం కావాలి? ఒక్కక్షణం కూడా నీ చెల్లెలు యీ యింట్లో వుండటానికి వీలేదు తక్షణం తీసుకెళ్ళిపో"

"నువ్వేతొందర పడకుబావా! నేనసలు విషయం కనుక్కుంటాను. ఏమే కమలా! ఇదంతా నిజమేనా? దాచకుండా నిజం చెప్పు" కోపంతో ఊగిపోయాడు మధు.

అవునన్నయ్యా! ఆగదిలో వుంటున్నది. మన పెదనాన్న కొడుకు వాసు. ఇక్కడే యం. బి. బి. యస్ చదువుతున్నాడట. ఒక రోజున కొళాయికి నీళ్ళకెళ్తే నన్ను చూసి తనరూమ్ చూపించాడు: నీళ్లకెళ్ళినప్పుడల్లా వాడి దగ్గరకు వెళ్ళేదాన్ని. మన కుటుంబ విషయాలు, కాలేజీ సంగతులు చెప్తూ తన హాస్యధోరణిలో నవ్విస్తూండేవాడు. రోజూ మాయింటికి రారా అని ప్రచెప్తే. ఉండు అక్కయ్యా! బావగారు నన్ను పెళ్లిలో నడిచిపోసారుగా! ఎంతవరకు గుర్తున్నానో కనుక్కోవాలి.

---

## రచయితలకు మనవి

యధారీతిగా "కథాంజలి" దీపావళి సంచిక వెలువడుతుంది.

ఒక చేతిమీదుగా యీ పత్రిక యింతకాలం నడుస్తునదీ అంటే దీంట్లో నా ప్రయోజకత్వం యేమీలేదన్న విషయం నాకు తెలుసు. రచయితల సహకారం, పాఠకుల ప్రోత్సాహం, ప్రకటన కర్తల ఆదరణ యీ పత్రికకు శ్రీరామరక్షగా పరిణమించాయని నేను ఒప్పుకోక తప్పదు.

అందరి సహకారం ఉండబట్టే 'కథాంజలి' ప్రతి మాసం నిర్ణీత దినాన్న బయటికి వస్తోంది: ప్రతి సంవత్సరం రెండు ప్రత్యేకసంచికలను కూడా వెలువరించ కలుగుతోంది.

ఈ ఆచారాన్ని పురస్కరించుకొని వచ్చే నవంబర్ నెల ర వ తేదీకి 'కథాంజలి' దీపావళి సంచిన వెలువడుతుందని ప్రకటించాడానికి సంతోషిస్తున్నాను. ప్రతి ప్రత్యేక సంచిక ఆకర్షణీయమైన రూపంతో మీముందు సాక్షాత్కరిస్తున్న సంగతిమీకు తెలియందికాదు.

పాఠకుల హృదయాలను చూరగొనాలనే ఆకాంక్షతో వచ్చే "దీపావళి" సంచికను సర్వాంగ సుందరంగా బయటికి తీసుకుని రాదలిచాను. దీనికి సంబంధించిన పనికూడా ప్రారంభమయింది.

నా ప్రయత్నానికి అమూల్యమయిన రచయితల ప్రోత్సాహం అవశ్యం కావలసి ఉంటుందని నేనుయిక్కడ వేరేచెప్పనక్కర్లేదు. చక్కని కథలతోపాటు రాజకీయ, ఆర్థిక, సాంఘిక, చారిత్రక విషయాలమీద వైజ్ఞానిక కాంతులను ప్రసరించే వ్యాసాలను క్లుప్తంగా వ్రాసి రచయితలు ర0-9-64 వ తేదీ లోపల అందజేయాలని మనవి. ఏ పరిస్థితులలోను యీ వ్యాసాలు మూడు పెద్ద పుటలకు మించకూడదు. రచనలతోపాటు వ్యాసకర్తలు తమ ఛాయా చిత్రాలనుకూడా ప్రచురణార్థం పంపాలని కోరుతున్నాను. అల్లా పంపుతే పాఠకులకు రచయితల దర్శన భాగ్యం లభించడానికి ఆస్కారం కలుగుతుంది.

"దీపావళి" సంచిక పని ప్రారంభమయిందని మరొకసారి రచయితలకు మనవి చేస్తున్నాను. వెంటనే వారు తమ వ్యాసాలను పంపి "కథాంజలి" యొక్క ముందడుగుకు దోహదం చేయాలసిందిగా మరొకసారి విజ్ఞప్తి చేస్తున్నాను.

—సంపాదకుడు.